


జోతీ సినీ సిండికేట్

పెత్తందార్లు

నిర్మాత
ఉ. విశ్వేశ్వరరావు B.Sc., దర్శకత్వం C.S. రావు B.A. (Lit)

KV మహదేవన్ G.K రాము TP మహారథి

D చెం ఓమ్మ ముని

కథా సంగ్రహం

"ఏ పల్లె చరిత్ర చూచినా - ఏముందిరా గర్వకారణం?
దిక్కు మొక్కు లేకున్నదా? - దిక్కులు చూస్తూ ఉన్నాదా?"
పై పలుకులు సత్యపూరితాలు.

అలాగే "పెత్తందారు" కథకూడా సత్యానికీ నిత్యజీవితానికి అతి దగ్గరగా ఉంటుంది. మన పల్లెసీమల్లో నాడూ, నేడూ కూడా ఉన్న పరిస్థితులే "పెత్తందారు" కథకు పంచప్రాణాలు.

ఫలానా పల్లె - అంటే పలువురికి కోపం రావచ్చు అందుకని మన పల్లెను "పెత్తనాలపాలెం" అనే అందాము. అందులో ఒకమున్సబు ఒక సర్పంచ్, సహకారమనే పేరుతో ఉన్న సమస్త కార్యాలయాలకూ ఒకే ఒక ప్రెసిడెంటు ఉన్నారు.

మున్సబు అచ్చయ్య, సర్పంచ్ బుచ్చయ్య, సహకార సంస్థల తాలూకు ప్రెసిడెంటు - సర్వం జగన్నాధం, ఆ ఊరిని పై ముగ్గురూ ఏలుతూన్నారన్నమాట. కిరీటంలేని రాజులు వాళ్ళు. వాళ్ళ కత్తులకు ఎదురులేదు. వాళ్ళ ధనదాహానికి అంతులేదు. అందుకని ఓ_నంపాదం చేస్తూన్నారు. పాపం పెంచుకుంటున్నారు.

అడిగేవాడు లేనన్నాళ్ళే ఏ పెత్తందార్ల చేతలకైనా హద్దు-పద్దు లేకుండా ఉండేది. పెత్తనాలపాలెంలోగూడా నవసమాజాన్నీ, సమసమాజాన్నీ స్థాపించాలనుకున్న ఆశయంగల యువకులున్నారుమరి. పోతే లేనిదల్లా నాయకత్వం. అదిగూడా అదృష్టవశాత్తూ ఏర్పడింది.

ఆ యువజన నాయకుడే చంద్రం. చంద్రం అంటే మరెవరో అనుకునేరు. దేవరకొండ భూషయ్యగారి అబ్బాయన్నమాట. ఇప్పుడు ఆ భూషయ్యగారి సంగతి :

భూషయ్య, మధ్యతరగతి రైతయినా మంచితనానికి మేరు పర్వత మంతటివాడు. ఆయనగారి మొదటిభార్య - పెత్తందారు సర్వంజగన్నాధం గారి చెల్లెలే. ఆ యిద్దరికి కలిగినవాడు - సూర్యం. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్న సూర్యం మేనమామగారింట్లోనే పెరిగి, పెద్దవాడై జగన్నాధంగారి అమ్మాయి లక్ష్మిని పెళ్ళాడి అక్కడే వుంటున్నాడు. యువజన నాయకుడు చంద్రం - భూషయ్యగారి రెండవభార్య రంగ

నాయకమ్మకు కలిగినవాడన్నమాట. ఆ యింటి కాకి యీ యింటిమీద వాలనంత యిదిగా కాకపోయినా, ఆ రెండు కుటుంబాలమధ్య బంధుత్వాలు యిప్పుడు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పండగలకూ పబ్బాలకూ లక్ష్మి తనకొడుకు రాజాతోగూడా అత్తవారింటికి వెళ్ళిరావడం ఉంది. అంతే, ఇకపోతే రాజామాత్రం ఎప్పుడూ భూషయ్యగారివద్దా, చంద్రం దగ్గరా ఉండిపోతూండేవాడు.

సూర్యానికి తలిదండ్రులతోనేకాదు; భార్యాబిడ్డలతోనూ, మేనమామతోనూ కూడా పెద్దగా దగ్గరితనంలేదు. ఆయనగారు పట్టణంలో నాగమణి యింటనే ఎక్కువకాలం గడిపేవాడు. పొరపాటున పెత్తనాల పాలెంలో అడుగిడినా - అది మేనమామవద్దో.... భార్యదగ్గరో .... బ్రతిమాలో బెదిరించో డబ్బుతీసుకుపోడానికే ఉపయోగపడేది.

పెత్తందారు జగన్నాథానికి చేతగాని, చేయలేని చెడుపని అంటూ ఏమీలేదు. ఉదాహరణకు :

పెత్తనాల పాలెంలో భూషయ్యగారికి కాస్త దూరపుబంధుగురాలు జానకమ్మ అనే ఒక వితంతువు ఉంది. ఆమెకు యిద్దరు కుమార్తెలు. నీరద, శారద. జగన్నాథం కన్ను నీరదమీద పడింది. బలాత్కారం చేశాడు. ఆ బాధతో నీరద గుండెఆగి అక్కడే చచ్చింది. సమితి ఆసుపత్రిలోని డాక్టర్ శామ్యూల్ జ్ఞానప్రకాశాన్ని బెదిరించి, నీరద పాముకాటుతో చచ్చినట్టు వ్రాయమన్నాడు. వ్రాయకపోగా, ఆ డాక్టరు పోలీసులకు రిపోర్టు చేయబూనుకునేసరికి అయన్ని చంపించి, రెండు శవాలనీ మార్కెటింగ్ సొసైటీ గోడౌన్‌లో పాతిపెట్టించి, నీరద డాక్టర్‌తో లేచిపోయిందని పుకారుపుట్టించడమేగాక, శారదను తనకిచ్చి పెళ్లిచేయమని జానకమ్మవద్దకు రాయబారం పంపించాడు. ఛీ-అంది జానకమ్మ. అయితే శారదపెళ్ళి ఎలా చేస్తుందో చూస్తానని శపథం పట్టాడు జగన్నాథం.

కాలక్రమేణా.... ఆ రెండు కుటుంబాలమధ్యనీ పూడ్చవీలులేని అఘాతం ఏర్పడింది. రాజా అక్షరాభ్యాసం రోజున, రాజా భూషయ్య చేతనే అక్షరాలు దిద్దించుకుంటాననడంతో పెద్ద రభస జరిగింది. అమానుషంగా జగన్నాథం రాజాని కొట్టడంతో చంద్రం అడ్డుపడి, బలవంతాన తన తండ్రిని పీటలమీద కూర్చోబెట్టి శుభకార్యాన్ని జరిపిస్తాడు. దానితో

కడుపుమండి, జగన్నాథం చంద్రాన్ని చంపమని తన కుడిభుజం - కోటయ్యను పురమాయిస్తాడు. ఆ ఊరికి కొత్తగా వచ్చిన డాక్టర్ రోహిణి చంద్రాన్ని రక్షిస్తుంది. ఆ యిద్దరిమధ్య ప్రేమ అంకురిస్తుంది.

ఆ డాక్టర్ రోహిణినికూడా బలవంతంచేయబోతాడు జగన్నాథం. బుద్ధి చెప్పినంతమాత్రాన, తెచ్చుకునే ఘటంకాదుగా మన పెత్తందారు?

జగన్నాథానికి వీరాంజనేయులు అనే ఒకకొడుకున్నాడు. గుమాస్తా గోవిందం కూతురు సరసతప్ప ఆ అబ్బాయి మరో ప్రపంచం ఎరుగడు. గోవిందానికి యిది నచ్చక, పెత్తందారుగారి అబ్బాయిని నయాన, భయాన బెదిరిస్తాడు కానీ కుర్రాడిది ఘాటుప్రేమ-ఆగగలదా? ఆలోచించి, ఓ లేడీ డాక్టరువేషం వేసుకుని, వీరాంజనేయులు సరసవద్దకు నిరాటంకంగా రాకపోకలు సాగిస్తూంటాడు,

పెత్తనాలపాలెంలో ఓ బిచ్చగాడు అవతరిస్తాడు. ఉట్టినే అడుక్కు-తినడమెందుకని, ఏ యింటికి వెళ్ళినా వేమననో....సుమతినో సందర్భయుక్తంగా "కోట్" చేసి నీతిబోధకూడా చేసేవాడు వాడు.

జానకమ్మ, శారద పెళ్ళి చేస్తుందన్న వార్తవిని, హుటాహుటి వెళ్ళి, జానకమ్మ పెద్దకూతురు నీరద డాక్టర్ శామ్యూయల్‌తో లేచిపోయిందని చెప్పి, రభసచేసి, ఆ పెళ్లి చెడగొట్టడంతో, భూషయ్యగారే తాలిమికోల్పోయి జగన్నాథంమీద ఉమ్మేస్తాడు. భూషయ్యనూ, భూషయ్య పరువునూ బజారుకెక్కిస్తానన్నాడు జగన్నాథం.

పాము కాటువేయడం దాని సహజమైనగుణం. అల్లుడు సూర్యాన్ని ఉసిగొల్పి. తండ్రిదగ్గరకు పంపి, ఆస్తికి సంబంధించిన గొడవలు లేవదీస్తాడు జగన్నాథం. అసలు భూషయ్య అనుభవిస్తూన్న ఆస్తంతా తాను తనచెల్లెలు (భూషయ్యగారి మొదటిభార్య) తాయారమ్మకు పసుపుకుంకుమక్రింద యిచ్చిందేనంటాడు. తప్పుడు సాక్ష్యాన్ని సమకూర్చుకునిదావా వేస్తాడు.

పాపం పెద్దమనిషి భూషయ్య కోర్టుకు బయల్దేరాల్సి వచ్చింది. బయల్దేరాడు. కానీ విధిలిఖితం! ఊరు దాటకముందే లారీక్రిందపడి ప్రాణం విడుస్తాడు.

ఆ తర్వాత ఏమయింది? - అంటే "పెత్తందార్లు" సినిమా చూస్తేగానీ తెలియదుమరి!

* పాటలు *

పాట 1

రచన : వీటూరి　　　　పాడినవారు : ఎల్. ఆర్. ఈశ్వరి

మణి : ఏకాంత సేవకు వేళాయెరా
ఈ కాంత నీ కొరకె వేచేనురా　　॥ఏకాంత॥
విరిసిన కన్నుల విరహాలు కురిపించి
అందాలె హారతిగ వెలిగించనీ
నా ఒంపు సొంపుల ఉయ్యాలలూగించి
అనురాగ శిఖరాలు అందించనీ　　॥ఏకాంత॥
వెండి వెన్నెలవుంది వేడి యౌవనముంది
వేడుకతీరగ విందారగించరా
వలపు ఆరని జ్వాల వయసు పాడెను జోల
పరువాల పాన్పున పవళించరా　　॥ఏకాంత॥
దుడుకు మారుని దాడి తాళగలేనురా
తడిసెను నా మేను తడవేలరా
ఆగని తమకాల తీరని మోహాన
అల్లరితో రేయి తెల్లవారనీకురా　　॥ఏకాంత॥

పాట 2

రచన : కొసరాజు　　　　పాడినవారు : ఘంటసాల

ఇంజనీరు : వ్యర్థమౌ నీటికి ఆనకట్టలు కట్టి
దేశ సంపద తీర్చి దిద్దువాడ
డాక్టరు : వ్యాధి బాధల మాన్పి ఆరోగ్యము ఘటించి
ప్రజలకు సుఖము చేర్పరచువాడ
వకీలు : ధర్మమ్ము నాల్గు పాదమ్ముల నడువంగ
న్యాయమ్ము కొరకు పోరాడువాడ

దేశభక్తుడు : జీవితమ్మును ప్రజాసేవకే అర్పించి
జాతికి విహితమ్ము సల్పువాడ

చంద్రం : చదువు సంధ్యలేదు పదవులేమియు లేవు
కండబలము తోడు గుండె కలదు
మేడి చేతబట్టి బీడైన దున్నెద
ముందు దారి చూపు గాంధీతాత

పాట 3

రచన : కొసరాజు పాడినవారు : ఘంటసాల అండ్ కోరస్

చంద్రం : నా దేశంకోసం నడుం బిగించి
నాగలి పట్టానోయ్
జన సామాన్యం సౌఖ్యంకోసం
స్వర్గం క్రిందికి తెస్తానోయ్ ॥నా దేశం॥
పాతాళంలో గంగను దీసీ
పైరుకు ప్రాణం పోస్తానోయ్
చివికిపోయినా జీవనాడులకు
జవసత్వం కల్పిస్తానోయ్ ॥నా దేశం॥
సిరులు పొంగినా జీవగడ్డకు
పుత్రులమై జన్మించామోయ్
కృషితో నాస్తి దుర్భిక్షమ్మని
సమాజమును నిర్మిస్తామోయ్ - నవ
సమాజమును నిర్మిస్తామోయ్ ॥నా దేశం॥
గాంధీ జవహరు దివ్యబోధలూ
ముందు దారి చూపించెనురా
త్యాగం ధర్మం ఆదర్శంగా
నాగలి జెండా కావలెరా - యీ
నాగలి జెండా కావలెరా ॥నా దేశం॥

పాట 4

రచన : ఆరుద్ర పాడినవారు : సుశీల

రోహిణి : మైమరపో తొలివలపో – యిది
మమతల మగతల కలగలుపో
ఏమిటో యిది ఏమిటో ॥మైమరపో॥
అతడు నవ్వెను తనలో తాను
ఆశలు రేగెను నీలో నీకు
పెదిమల అరుణిమ పెరిగినదీ – నీ
హృదిలో మధురిమ పొంగినదీ ॥మైమరపో॥
గుండెల దడదడ మితిమీరె – నీ
కోమల గళమున శ్రుతిచేరె
గాలిసోకితే కాకలు కలిగె
కౌతుక కన్నుల రేకులు వెలిగె ॥మైమరపో॥
ఒంటరి హృదయము వలచినదే – నీ
జంట యెవ్వరో తెలిసినదే
చూపుల పంపవె సందేశం – ఎద
చోటు వున్నదే నీ కోసం ॥మైమరపో॥

పాట 5

రచన : కె. అప్పారావు పాడినవారు ; సుశీల, రఘురాం అండ్ కోరస్

స్త్రీ : మా పాడిపంటల సల్లంగ సూడు
మా పిల్లపాపల సల్లంగ సూడు
నీ సత్తాలు సూపించి కాపాడవమ్మా
గంగానమ్మా – పోలేరమ్మా – అమ్మా।
చెరువులే నిండాలి కాలవలు పొంగాలి
దాన్నాలు పండాలి గాదెలే నిండాలి – అమ్మా ఓయమ్మా
మా రెక్కల కష్టం మాకే దక్కాలమ్మా....గంగానమ్మా

పురుషుడు మా కండలే నీకు కర్పూరమమ్మా
మా దణ్ణాలే నీకు పూదండలమ్మా
మా గుండెలే నీకు నైవేద్యమమ్మా
నీ సత్తాలు సూపించి కాపాడవమ్మా....గంగానమ్మా

స్త్రీ : నువ్వే దేవతవని నీకాడి కొస్తాము
మా పాలి తల్లివని నీ పూజ చేస్తాము
మొక్కులన్నీ నీకు గంగానమ్మా
మక్కువతో తీర్చేము పోలేరమ్మా
కరుణించి మమ్మేలు మముగన్న అమ్మా

పాట 6

రచన : శ్రీశ్రీ పాడినవారు : ఘంటసాల

పంద్రం ; మానవుడా ? ఓ మానవుడా !
విన్నావా.... అది విన్నావా ?
ఎంతో పెద్దది ఆకాశం
ఏమంటున్నది నీ కోసం
తనలాగే నీ హృదయంకూడా
విశాలమైతే చాలంట ॥మానవుడా॥

ఎంతో గొప్పది భూమాత - అది
ఏమంటున్నది నీ మాట
తనకున్నట్టే నీలోకూడా
సహనం వుంటే చాలంట ॥మానవుడా॥

ఆగకవీచే ఆ గాలి
అది ఏమన్నది నీతోటి
తనలో వుండే చల్లని గుణమే
నీలో వుంటే చాలంట ॥మానవుడా॥

జలజలపారే యీ నీరు
ఏమంటున్నది యీనాడు

తనవలె నీవూ కనికారంతో
కన్నీరై తే చాలంట ॥మానవుడా॥

భుగభుగమండే ఆ నిప్పు
నీతో ఏమంటున్నది చెప్పు
తనలాగే నీవన్యాయాలను
దగ్ధంచేస్తే చాలంట ॥మానవుడా॥

త్యాగజీవి - సహనశీలి
ఈనాటిది కాదీగాథ
ఒకనాటిది కాదీబాధ
ధరలో నరునిచరిత్ర సమస్తం
చర్విత చర్వణమేనోయీ ।
ఆత్మబలం - నీ మూలధనం
ఏ సిరులూ - దానికి సరికావు
మంచికి నీదే మరొక్క పేరు
ప్రజలహృదయమే నీవూరు - నీ
ప్రజల హృదయమే నీవూరు

పాట 7

రచన ; దాశరధి   పాడినవారు : సుశీల, బాలసుబ్రహ్మణ్యం

మోహన్ } దగ్గరగా యింకా దగ్గరగా
శారద } చెక్కిలిపై చెక్కిలిగా
యిద్దరమూ ఒక్కటిగా
ఈ రేయి గడపాలి జీవితమే నడపాలి

మోహన్ : తిరిగి రాబో నీ తీయని తొలిరేయిని
కౌగిట దాచాలి కాలము నాపాలి
పానుపులో పూలన్నీ పాటపాడే వేళాయే
ఏవేవో కోరికలు ఆటలాడే వేళాయే ॥దగ్గరగా॥

శారద : నాలో యీనాటు నవ్వులు విరబూసినవి
నోచిన నా నోములు నీవై పిలిచినవి

మోహన్; హృదయాలే ఊయలలై ఊగిపోయే వేళాయె
వెన్నెలలూ మల్లియలూ అన్నీ నేడు మనవాయె ॥దగ్గరగా॥

పాట 8

రచన ; కొసరాజు పాడినవారు ; మంటసాల అండ్ కోరస్

బుర్రకథ :

చంద్రం అండ్ కోరస్ :

అరెరే
రామకృష్ణుల కన్నదేశం
వేద ఘోషల విన్నదేశం
పూజ్య గాంధీజీని కన్నాదీ నారాయణా
బుద్ధదేవుని బోధ విన్నాదీ నారాయణా
పల్లె సీమలె దేశానికి సౌభాగ్యం అన్నారా
ప్రభుత్వానికా పల్లెసీమలే స్థంభాలన్నారా

వ : అలాంటి పల్లె బ్రతుకు లెలావున్నాయి ?
ఎంచబోతే మంచానికన్నీ కంతలన్నట్లున్నాయి.

ఏపల్లె చరిత్ర చూచినా
ఏముందిరా గర్వకారణం
భూమి కొందరికి దూరమై
బ్రతుకు లెందరికో భారమై
దిక్కు మొక్కు లేకున్నావా
దిక్కులు చూస్తూ ఉన్నాదా
బ్యాంకి ప్రెసిడెంటొక్కడూ
పంచాయతి సర్పంచొక్కడూ
గ్రామాధికా రింకొక్కడూ
గ్రామ ప్రజల ... ॥తందాన॥

ఏ ఒక్క కడుపూ కాలినా
ఏ ఒక్క మనసూ ఏడ్చినా
అది నీ జాతికె కీడురా
మంచికి మార్గం కాదురా

వ : మంచీ మంచీ అంటావు ఎక్కడుందిరా మంచి ?

చంద్రం : ఔను ఎలా వుంటుంది ?
మంచికి పోయిన మహాత్ములెందరో మన్నైనారన్నా
పది సూత్రమ్ములు పల్కిన క్రీస్తు సిలువకెక్కె మొన్నా
శాంతి అహింసల చాటిన గాంధిని చంపిరిగద విన్నా
అట్టివారికే పాపభీతి లేదెవరేమనుకున్నా

వ : అయితే మనదారి గోదారేనా ?
కాదు....
గ్రామమంతా కట్టుగట్టీ
గట్టిగా ముందడుగు బెట్టీ
అక్రమాలకు ఎదురు నిలిచాలా
విక్రమించీ గదిమి పలికారా
నిజం తెలిసినా ప్రజల మధ్య మనలేవిక పో పోరా
నీ - కిక్కడున్న హక్కేమిటి ఊరికి పెద్దకొడుకువటరా ?

వ : లెండి ! వీర యువకులంతా కళ్లు తెరవండి.
ప్రతి ఒక్కడు మనజాతి సంస్కృతిని ప్రతిబింబించాలి
అందరు కలిసి దేశ సంపదల అనుభవించవలెరా
దేశానికి వెన్నెముక యువతరం వెలిగించుడు జోతీ
అపుడే విశ్వానికి శాంతదిగో విశ్వశాంతి
అదే విశ్వశాంతి....అల్లదే విశ్వశాంతి

: సాంకేతిక నిపుణులు :

రచన	.... టి. పి. మహారథి
పాటలు	.... శ్రీ శ్రీ, కొసరాజు, ఆరుద్ర, దాశరథి, కె. అప్పారావు, బి.ఎ.
సంగీత దర్శకత్వం	.... సంగీత చక్రవర్తి కె. వి. మహాదేవన్
అసోసియేట్	.... పుహళేంది
ప్లేబాక్	.... ఘంటసాల, సుశీల, ఎల్.ఆర్. ఈశ్వరి, బాలసుబ్రహ్మణ్యం, రఘురాం
సాంగ్స్ రికార్డింగ్	.... ఎ.ఆర్. స్వామినాధన్ (విజయాగార్డెన్స్) ఎస్. పి. రామనాధన్ (గోల్డెన్)
రీ-రికార్డింగ్	.... ఎ. ఆర్. స్వామినాధన్ (విజయాగార్డెన్స్)
ఆర్ట్ డైరెక్టర్	.... యస్. కృష్ణారావు
డాన్స్ డైరెక్టర్	.... తంగప్పన్
మేకప్	.... పీతాంబరం, భద్రయ్య, మాధవరావు, కృష్ణ, భక్తవత్సలం
ఎడిటర్	.... ఆర్. హనుమంతరావు
ప్రొడక్షన్ కంట్రోలర్	.... ఎ. కె. వి. ప్రసాద్
అసోసియేట్ డైరెక్టర్స్	.... వి. యస్. రంగస్వామి, టి. దయాసాగర్
డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ	.... జి. కె. రాము
అసోసియేట్ ప్రొడ్యూసర్స్	.... కె. రాధాకృష్ణ, సి. హెచ్. శేషగిరిరావు

ప్రొడ్యూసర్ : యు. విశ్వేశ్వరరావు, B. Sc.

డైరెక్టర్ : పి. యస్. రావు, B. A. (Litt)

నటీనటవర్గం

పద్మశ్రీ, నటరత్న
యన్. టి. రామారావు
శోభన్‌బాబు,
నాగభూషణం
పద్మశ్రీ నాగయ్య
పద్మశ్రీ రేలంగి వెంకట
రామయ్య
రాజబాబు,
సత్యనారాయణ,
ధూళిపాళ
ప్రభాకరరెడ్డి
అల్లు రామలింగయ్య
ముక్కామల
రావు గోపాలరావు

సావిత్రి
విజయనిర్మల
విజయలలిత
జ్యోతిలక్ష్మి
హేమలత
సంధ్యారాణి
రమాప్రభ
టి. జి. కమల
ఝాన్సీ
బేబీరాణి

డిస్ట్రిబ్యూటర్సు :

ఆంధ్ర : జ్యోతీ పిక్చర్స్, విజయవాడ
సీడెడ్ : జయలక్ష్మి, గుంతకల్
నైజాం : ఉషా ఫిలింమ్స్, సికింద్రాబాద్

వెల 10 పైసలు కమలేంద్ర ప్రెస్, విజయవాడ-2

జోతి సినీ సిండికేట్

పెత్తందార్లు

నిర్మాత U. విశ్వేశ్వరరావు B.Sc

దర్శకత్వం C.S. రావు B.A.(Litt)

